# ఉన్నది ఉన్నట్టు.. అందం నచ్చేట్టు!

- అందానికి ప్రాధాన్యతనిస్తున్న నగరవాసులు
- కుటుంబ సమేతంగా సెలూన్స్, పార్లర్స్‌కు
- సామాన్యులు సైతం సెలబ్రెటీలుగా తయారు
- నగరంలో విస్తరిస్తున్న అంతర్జాతీయ ట్రెండింగ్ సెలూన్స్





సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : నగరవాసులు అందానికి ప్రాధాన్యతనిస్తున్నారు. కుటుంబ సమేతంగా సెలూన్స్, పార్లర్స్‌కు వెళ్లడంపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకొని సెలూన్స్ సైతం సౌందర్య సంరక్షణకు అంతర్జాతీయ ప్రమాణాలు జోడిస్తున్నాయి. సామాన్యులను సైతం సెలబ్రెటీలుగా తీర్చిదిద్దడానికి విభిన్న రకాల సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. ఇదే క్రమంలో గ్రేటర్‌లో విస్తృతంగా ట్రెండింగ్ సెలూన్స్ వెలుస్తున్నాయి. ముఖ్యంగా యునిసెక్స్ సెలూన్స్‌కు నగరంలో డిమాండ్ ఉంది. వీకెండ్ వచ్చిందంటే ఫ్యామిలీ అంతా సెలూన్‌కు వెళ్లి అందంగా కనిపించేందుకు తహతహలాడుతున్నారు. అలంకరణ మీద ఒక కుటుంబం సుమారుగా నెలకు రూ.20వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ముఖ్యంగా హెయిర్ కేర్, స్కిన్, బాడీ కేర్, హెయిర్ కలరింగ్, గ్రూమింగ్, స్పా, హెయిర్ స్పా, నేయిల్ ఆర్ట్, హెయిర్ స్టైలింగ్, మానిక్యూర్, మేకప్, డెటన్, పెడిక్యూర్, మెనిక్యూర్, ప్రీమియం ఫేషియల్స్, ఫేషియల్స్, క్లిన్‌అప్స్, హెయిర్ ఫార్మ్స్, వెల్ల హెయిర్ స్పా తదితర సేవలను అందిస్తున్నాయి.

### హెయిర్ కలరింగ్ ధరలు ఇలా..!

అమోనియా ఫ్రీ రూ.1000, ఫ్యాషన్ కలర్ రూ.1200, క్రిస్టల్ పెడిక్యూర్ రూ.1000, హీల్ పీల్ రూ.1500 ఉన్నాయి. రేడియంట్ ఫేషియల్ రూ.3,500, గ్లో రూ.3,500, ఆక్సీజన్ ఫేషియల్ రూ.4,500, స్రెయిటనింగ్ 3 వేల నుంచి 12 వేల వరకు చార్జీ చేస్తారు.

**అత్యాధునికంగా..!!**

ఇంటర్నేషనల్ జ్యాసి సెలూన్, హబీబ్ లాంటి సెలూన్ బ్రాంచీలు నగరంలో మరిన్ని ప్రారంభమయ్యాయి. వీటి సరసన ఇంకొన్ని అత్యాధునిక సెలూన్స్ ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఏసీ గదులు, ఇంటీరియర్ డిజైన్స్, పూల మొక్కలు, విశాలమైన గదులు ఇలా అన్ని రకాలుగా ఆకట్టుకునేల సెలూన్స్‌ను తీర్చిదిద్దుతున్నారు. వేయిటింగ్ కస్టమర్లకు బోర్ లేకుండా మ్యాగ్జిన్స్, టీవీ, పజిల్స్ లాంటి సేవలను అందిస్తున్నారు. అంతే కాదు ధరలు కూడా మెనూలో పొందుపర్చి సేవలను అందిస్తున్నారు.

**సోషల్ ట్రెండ్..!!**

అలంకరణకు సోషల్ మీడియా ప్రధానంగా కనిపిస్తున్నది. అందంగా తయారై ఫొటోలు దిగి ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాలో షేర్ చేయడమనే ఆసక్తి విరివిగా పెరిగింది. ఒక్కో ఫొటోలో ఒక్కో లుక్ ఉండేల అలంకరణపై దృష్టి పెడుతున్నారు. లైక్స్, కామెంట్స్ వచ్చేల ట్రెండీ లుక్స్‌ను ఆశ్రయిస్తున్నారు. అందంగా కనిపించడం కోసం బ్యూటీప్రొడక్ట్స్‌ను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసే వారి సంఖ్య పెరిగింది. సినిమాల్లో హీరోలను అనుసరిస్తూ గ్రూమింగ్ ఫాలో అవుతున్న వారూ ఉన్నారు. ఆత్మ విశ్వాసంగా కనిపించడంలోనూ అలంకరణ ప్రధాన పాత్ర పోషిస్తున్నది.

### పురుషుల్లో అలంకరణపై శ్రద్ధ పెరిగింది



అలంకరణ అనేది అమ్మాయిలకే పరిమితం కాలేదు. మహిళలతో సమానంగా ట్రెండీ స్టైల్‌గా కనిపించేందుకు పురుషులు కూడా ఇష్టపడుతున్నారు. పండుగలు, వేడుకల్లోనూ ఆ మార్పు ఇటీవల కాలంలో మొదలైంది. కుర్రకారుతో పోటీ పడేందుకు యువకులుగా కనిపించేందుకు 40 ఏండ్లు పైబడిన వారు కూడా అధిక ఆసక్తి చూపిస్తున్నారు.

*-సునీత, నిర్వాహకురాలు*

### కెరీర్‌లోనూ అలంకరణ కీలకమైంది



చాలా కంపెనీలు పనిలో నైపుణ్యం, ప్రతిభను పరిగణలోకి తీసుకునేవి. మారిన పరిస్థితుల్లో ఎన్నో రంగాల్లో ఉద్యోగాలు వచ్చాయి. నైపుణ్యం, ప్రతిభతో పాటు అందంగా కనిపించడం కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు. వినియోగదారులతో నేరుగా సంబంధాలు ఉండే కొలువుల్లో చక్కగా సిద్ధం కావడం, రోజంతా హుషారుగా ఉండటం అదనపు అర్హతగా భావిస్తున్నారు. ఇప్పుడు అలంకరణ అనేది జీవితంలో ఒక భాగమైపోయింది.

*-శ్రావ్యరెడ్డి, ఫౌండర్, ఇంటర్నేషనల్ జ్యాసి సెలూన్ సెంటర్*

### పీవీకి భారత రత్న హర్షణీయం



పీవీ ప్రభాకర్ రావు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న ప్రకటించడం పట్ల ఆయన కుమారుడు, పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ ప్రభాకర్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం చిక్కడపల్లిలో ఆయన మాట్లాడుతూ తన తండ్రికి పురస్కారాన్ని ప్రదానం చేయడం పట్ల ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన పేరును భారత రత్నకు సిఫార్సు చేస్తూ ఏకగ్రీవ తీర్మాణం చేసి ఆమోదించిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### సేల్స్, స్కిల్స్‌లో ఉచిత శిక్షణ..

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 11 : అంబర్‌పేట పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళలకు నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రిటైల్, సేల్స్ రంగంలో 28 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ తెలిపారు. శిక్షణ సమయంలో రిటైల్‌తో పాటు ఎంఎస్ ఆఫీస్, టైపింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్ నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థినులతో పాటు ఆపై విద్యార్హతలున్న 18 నుంచి 30 సంవత్సరాల వయసున్న మహిళలు అర్హులన్నారు. వివరాలకు 88863 02224/244 సంప్రదించాలని కోరారు.

## బ్యాడ్మింటన్ విజేత రక్షితశ్రీకి సిల్వర్



రక్షితశ్రీని అభినందిస్తున్న కోచ్ అనిల్ తదితరులు

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 11 : బీడబ్ల్యూఎఫ్ లీనింగ్ శ్రీలంక ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీలో రక్షితశ్రీ సిల్వర్ దక్కించుకున్నది. శ్రీలంకలోని గాలే వేదికగా జరిగిన ఈ టోర్నీ ఆదివారం ముగిసింది. ఫైనల్‌లో ఇండియాకు చెందిన ఇషారాణితో హోరాహోరీగా 40నిమిషాల పాటు జరిగిన పోరులో హైదరాబాద్ కొటక్ పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన రక్షితశ్రీ గట్టి పోటీని ఇచ్చి 22-20, 21-14 స్కోరుతో ఓటమి చెంది సిల్వర్‌తో సరిపెట్టుకుంది. భారత్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, అకాడమి సీనియర్ కోచ్ రాజేందర్, అనిల్ తదితరులు అభినందించారు.

## రోశయ్య సేవలు మరువలేనివి

*విగ్రహావిష్కరణలో మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు*



ముషీరాబాద్ వాసవి ఆర్యవైశ్య హాస్టల్ భవన్ ప్రాంగణంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 11 : మాజీ ముఖ్యమంత్రి, దివంగత రోశయ్య రాష్ట్రానికి, దేశానికి అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో వాసవి ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్, దివంగత కొనిజేటి రోశయ్య విగ్రహాన్ని ఆయన ముషీరాబాద్, అంబర్‌పేట ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రాష్ట్ర పర్యాటక శాఖ మాజీ చైర్మన్, ఐవీఎఫ్ నేషనల్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఐవీఎఫ్ చైర్మన్, అడ్వైజరీ బోర్డు సెంట్రల్ కమిటీ సభ్యుడు గంజి రాజమౌళి గుప్తాలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోశయ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ జనరల్ సెక్రెటరీ పబ్బ చంద్రశేఖర్, కోశాధికారి కొడిపాక నారాయణ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెల్లూరి మధు, గట్టు మహేశ్, కాచం కృష్ణమూర్తి, గెల్లి రమేశ్, అదనపు ప్రధాన కార్యదర్శి కటకం శ్రీనివాస్, ట్రస్ట్ కోశాధికారి గెల్లి ప్రభాకర్, ముత్యాల సత్తయ్య, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఓలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలి




మాట్లాడుతున్న జాక్ చైర్మన్ గోల్కొండ సతీశ్

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 11 : గ్రామ రెవెన్యూ అధికారులను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జాక్ చైర్మన్ గోల్కొండ సతీష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గన్‌ఫౌండ్రీలోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో సంఘం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భాగంగా ఆయన మాట్లాడుతూ 5845 మంది వీఆర్వోల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని, మరణించిన 178మంది వీఆర్వోల కుటుంబాలకు కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అడిషనల్ సెక్రటరీ జనరల్ పల్లెపాటి నరేశ్, సంఘం వైస్ చైర్మన్‌లు కాందారి భిక్షపతి, రామేశ్వర్‌రావు, సర్వేశ్, చింత మురళి, మహిళా నాయకురాలు ప్రతిభ, జేఏసీ నాయకులు పరమేశ్, వెంకన్న, మోహన్, వెంకటేశ్వర్లు, వినయ్, శ్రీహరి నాయక్‌తో పాటు వివిధ జిల్లాల వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## నెక్లెస్ రోడ్‌లో *వాక్ ఫర్ హెల్త్*



వాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, చిత్రంలో మల్లారెడ్డి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 11 : తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా వద్ద నిర్వహించిన ''వాక్ ఫర్ హెల్త్'' ర్యాలీని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, టీటీఏ వ్యవస్థాపకులు, సలహా మండలి చైర్మన్ పైళ్ల మల్లారెడ్డి, అధ్యక్షుడు వంశీరెడ్డి, ప్రెసిడెంట్ ఎలక్ట్ నవీన్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో టీటీఏ అంతర్జాతీయ కోఆర్డినేటర్లు డాక్టర్ దువ్వూరు ద్వారకానాథ్ రెడ్డి, సేవా డేస్ కోఆర్డినేటర్లు సురేశ్ రెడ్డి, దుర్గా ప్రసద్, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కవితా రెడ్డి, పెరుక నరసింహ, దూదిపాల జ్యోతి రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి

*మంత్రి తుమ్మల నాగేశ్వర రావు*




నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 11 : చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర చేనేత, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఆదివారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ పథకాలు చేనేత కార్మికులకు అందించే విధంగా కృషి చేస్తానని చెప్పారు. అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్లస్వామి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర ఉన్న పద్మశాలీ సంఘం నిరంతరం ఈ సామాజిక వర్గం అభివృద్ధికి పాటు పడుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ చేనేత సమస్యలపై చర్చించేందుకు అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. పద్మశాలీ కులస్తులందరూ సంఘటితమై ప్రభుత్వ పరంగా వచ్చే హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ , మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పొన్నాల శ్రీరాములు, సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామ చందర్‌రావు, యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్, మహిళా విభాగం అధ్యక్షురాలు వనం దుశ్యంతల, ఇంజినీరింగ్ విభాగం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, రాష్ట్ర నాయకులు మెతుకు సత్యం, అంబటి శ్రీనివాస్, గుంటక రూప, కత్తుల సుదర్శన్, గుర్రం శ్రవణ్, శారద, ప్రవళిక, అమరేందర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## 15న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ పిడమర్తి రవి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 11 : తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 15న లక్డీకాపూల్‌లోని హోటల్ సెంట్రల్ కోర్టులో నిర్వహించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పిడమర్తి మాట్లాడుతూ ఉదయం 11నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ సమ్మేళనంలో మలి దశ తెలంగాణ ఉద్యమకారులైన ప్రొఫెసర్ కోదండరాం, స్వామిగౌడ్, అందెశ్రీ, పాశం యాదగిరి, విమలక్క పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం, రమేశ్ యాదవ్, సంజీవ్ నాయక్, ఉపేందర్, ఆజాద్, శ్వేత, రాజు, అందె కృష్ణ, బాబు రావు, సురేశ్, చిరుమర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాలికా సాధికారత.. పరుగుతో చేయూత..!



సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 ( నమస్తే తెలంగాణ ) : సేవా భారతి తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం గచ్చిబౌలిలో నిర్వహించిన 'రన్ ఫర్ గర్ల్ చైల్డ్' కార్యక్రమాన్ని తమిళిసై సౌందర రాజన్, సేవా భారతీ ప్రెసిడెంట్ దుర్గారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

## కళలు, కళాకారులకు అండగా ప్రభుత్వం

*శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్*




కళాకారులను జ్ఞాపికతో సత్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

కొండాపూర్, ఫిబ్రవరి 11 : రాష్ట్రంలో కళలకు, కళాకారులకు కొదవలేదని, వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ జానపద, శాస్త్రీయ ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్, త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ కళలు అపూర్వమైనవని అన్నారు. ఈ కార్యక్రమంలో తారా ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు సంఖ్య రాజేశ్, సినీ నటి హరితేజ, నృత్య గురువులు డాక్టర్ భాగవతుల సేతురామ్, డాక్టర్ ఆర్.ప్రసన్న రాణి, మిస్ ఇండియా అనిషారెడ్డి, భూపతి రాజు, రాజగోపాల్‌రాజు, పలువురు సినీ తారలు, కళాకారులు పాల్గొన్నారు.

## నుమాయిష్‌లో సినీనటి జయసుధకు సత్కారం



అబిడ్స్, ఫిబ్రవరి 11: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనలో భాగంగా నిత్యం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో అనేక సాంస్కృతిక కార్యక్రాలను చేపడుతూ వస్తున్నారు. ఆదివారం టాలీవుడ్ సింగర్ సునీత గీతాలాపన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీనటి జయసుధను ఘనంగా సత్కరించారు. సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి ఏనుగుల రాజేందర్ కుమార్ గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ సలహాదారు డాక్టర్ ప్రభాశంకర్, కన్వీనర్ ముఖర్ హైదర్ జయసుధను సన్మానించారు. ఈ సందర్భంగా జయసుధ మాట్లాడుతూ.. అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనలో తనకు సన్మానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వనం ఉష తదితరులు పాల్గొన్నారు.

## 23న లైవ్ కాన్సర్ట్




బంజారాహిల్స్‌లోని ఎస్‌వీఎం గ్రాండ్‌లో లైవ్ కాన్సర్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌పీ.పట్నాయక్, సింగర్ సునీత తదితరులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 11 : నగరంలోని సంగీత ప్రియులను ఉర్రూతలూగించేందుకు ప్రముఖ సినీ నేపథ్యగాయని, మెలోడీ క్వీన్ సునీత ఉపద్రష్ట ఆధ్వర్యంలో మార్చి 23న మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో లైవ్ కాన్సర్ట్ నిర్వహించనున్నారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నం 1లోని ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్‌లో గాయని సంగీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్‌పీ.పట్నాయక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టెంపుల్ బెల్ ఇవెంట్స్ నిర్వాహకులు కౌశిక్ రామ్ మద్దాలి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ మఠం స్వర్ణోత్సవాలు



భక్తులతో కలిసి భజనలు చేస్తున్న స్వామి బోదమయానంద

కవాడిగూడ, ఫిబ్రవరి 11 : దోమలగూడలోని రామకృష్ణ మఠం స్వర్ణోత్సవాలు ఆదివారం కన్నుల పండువగా జరిగాయి. స్వామి బ్రహ్మానంద జీవిత సందేశంపై సింగపూర్ రామకృష్ణ మఠం నుంచి వచ్చిన స్వామి సత్యలోకానంద ప్రసంగించారు. రామకృష్ణ మఠం సహాయ ప్రధాన కార్యదర్శి స్వామి తత్త్వవిదానంద స్వామి, పూణే రామకృష్ణ మఠం అధ్యక్షుడు శ్రీకాంతానంద, రాజమండ్రి రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞాయానంద తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మఠం హైదరాబాద్ అధ్యక్షుడు స్వామి బోదమయానంద మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు అనుసరనీయమని పేర్కొన్నారు. యువ సంఘర్ష్ విజేతలకు బహుమతులను అందజేశారు.

### చల్లబడిన నగరం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : వాతావరణం చల్లబడడంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి సాధారణ స్థాయికి చేరుకున్నాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో పగటి ఉష్ణోగ్రతలు 31.8డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 21.3డిగ్రీలు సెల్సియస్, గాలిలో తేమ 45శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

### ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లకు నోటిఫికేషన్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 11 : డా.బీఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీఏ, బీకాం, బీఎస్‌తో పాటు పీజీ, డిప్లొమా కోర్సులలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఫిబ్రవరి 29లోగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు.